నిష్పరవ్వాలు

అర్థరాత్రి దూరంగా ఎక్కడో దేనికోసమో ఎడతెరిపిలేకుండా మొరుగుతున్న కుక్కలు ప్రక్కవరండాలో నుంచి భయంకరంగా విన్పిస్తున్న రెడ్డిగారి గుర్రు. బంగళా బయట గడ్డిమీద పడుకొని దొర్లుతున్నాను. — సరోజ వస్తుంది నన్ను లేపుతుంది. ఆ గదికి తీసుకెళ్తుంది. ఆ గదిలో – నన్ను – ఆకలితో అలమటిస్తున్న సరోజ నలిపేస్తుంది. నాశనం చేస్తుంది.

ఈ రోజు యింకా రాలేదెందుకో? చుట్టూ చీకటి – ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాలు– ఊరంతా సద్దుమణిగింది. ఉన్నట్టుండి యేదో పిట్ట వికృతంగా, భయంకరంగా అరుచుకుంటూ పోయింది. ఆ అరుపు వినడంతోటే ఎందుకో నాలో వణుకు పుట్టింది. ఆ పిట్టను గూర్చి చిన్నప్పుడు ఎవరో చెప్పగా విన్నాను. ఆ పిట్టను దయ్యంపిట్ట అంటారట. ఆ పిట్ట వూరిమీద అరచుకుంటూ పోయిందంటే ఆ ఊరికేదో అరిష్టం మూడిందన్నమాటే– ఆ పిట్ట అరచినప్పుడల్లా దాని నోట్లోంచి రక్తం పడ్తుందట- అలా ఎన్ని రక్తపుబొట్లు ఒక వూరిమీద పడితే ఆ ఊళ్లో అంతమంది జనం చచ్చిపోతారట. ఇవన్నీ జ్ఞాపకం రాగానే నాలోవణుకు అధికమైంది. ప్రక్కనే రెడ్డిగారి గుర్రు యింకా భయంకరంగా విన్పించింది. దూరంగా కుక్కలు యింకా యింకా వికృతంగా మొరుగుతున్నట్లనిపించింది.

ఇంకా సరోజ రాలేదు. ప్రతిరోజూ ఆ మూడుచుక్కలు వాటిని గొరకొయ్యలు అంటారట. ఆ గొరకొయ్యలు తలమీదకి వచ్చేటప్పటికి సరోజ వచ్చేదీ- ఈ రోజు ఆ సమయం దాటిపోయింది. మళ్ళా ఆ పిట్ట ఈసారి సరిగ్గా నా మీదనుండే అరచుకుంటూ పోయింది. నా గుండెలు

వేగంగా కొట్టుకున్నాయి. నా కాళ్లు, చేతులు వణకడం మొదలెట్టాయి. ఈసారి ఆ పిట్ట నోట్లోంచిపడ్డ రక్తం నా మీదనే పడ్డట్టుగా అనిపించింది. ఏదో వడిగా తాకినట్లనిపించింది. తుడుచుకోబోయాను - కాని కాళ్ళు, చేతులు కదల్లేదు. స్తంభించిపోయాను. దూరంగా ఎవరో మేలుకొని ఆ పిట్టను కొడ్తున్నారు.

మళ్ళా నిశ్శబ్దం-కుక్కలు మొరగడం ఆపేశాయి. ప్రక్కకి దొర్లి పడుకున్నట్టున్నాడు — రెడ్డిగారు గుర్రు కాస్త తగ్గింది. కాని సరోజ రాలేదు. ఆమె గది తలుపులు కిర్రుమన లేదు. సరోజ నన్ను ఆ గదికి ఆ పాడుబడ్డ గదికీ-తీసికెళ్ళి— ఎందుకో మెఱుపులా సరోజంటే ఏదో భయం నాలో ప్రవేశించింది. సరోజ ఆకలితోవున్న పులి-నన్ను తినేస్తుంది. నన్ను సర్వనాశనం చేస్తుంది. రెడ్డి—రెడ్డి నా పాలిటియముడు. ఈ ఇంట్లో ప్రాణాల్తో పాతేస్తాడు నన్ను—ఈ ఇల్లే ఒక దెయ్యాలకొంప-జైలు పద్మవ్యూహం ఈ ఇంట్లో మనుష్యులు నివ సించరు. భూతాలు, ప్రేతాలు - పిశాచాలు నివసిస్తాయి. సరోజ ఒక భూతం, రెడ్డి ఒక బ్రహ్మరాక్షసుడు. నన్ను ఈ ఇంట్లో బంధించారు. నన్ను హింసిస్తూ నాతో ఆడుకొంటున్నారు — — వెంటనే ఈ యింట్లోంచి పారిపోవాలి.... వెంటనే—ఈ క్షణమే—కాళ్ళూ, చేతులూ కదలవు. ఇంకాస్సేపట్లో సరోజ వస్తుంది—నేను లేకపోతే సరోజ తల్లడిల్లిపోతుంది—పాపం సరోజ....కాని నేను పారిపోవాలి— ఈ ఇంట్లో ఇంకా వుంటే నాకు చావు తప్పదు. అసలు తెల్లవారేలోగా నాకు చావు తప్పదు. ఆ పిట్ట ఆ దెయ్యంపిట్ట నా మీద రక్తం కక్కిపోయింది— యింక బ్రతుకుతానా ? తెల్లవారేలోగా రెడ్డి, సరోజ కలసి నన్ను ముక్కలుముక్కలుగా కోసేసి ఈ యింట్లో పాతిపెడతారు....ఈ యిల్లు ఈ యిల్లంటేనే నా కసహ్యం....ఈ యింటికి నేను రావడం అంతా కలగా క్షణంలో నా నిమిత్తం లేకుండానే జరిగిపోయింది.

నేను ఎక్కడ ఎవరికి పుట్టానో నాకు తెలియదు. నాకు రెండు మూడేళ్ళున్నపుడే మా అమ్మ చనిపోయిందట. మా నాన్నగూర్చి నాకేమీ తెలియదు—నా కసలు నాన్ననేవాడే లేడని అనేవాళ్ళు చాలామంది. మా అమ్మ రామిరెడ్డి దొర యిట్లో పనిచేస్తుండేదట. అమ్మ చనిపోయాక

నేను రామిరెడ్డి యింట్లోనే పడి బ్రతికాను. వాళ్ళే యింత పెట్టేవాళ్ళు. నాకు ఐదేళ్లు వచ్చినప్పటినుండి వాళ్ళకి ఆపనీ ఈపనీ చేసిపెడ్తుండేవాడిని. అలాగే వాళ్ళింట్లో పనివాడిలా స్థిరపడిపోయాను.

రామిరెడ్డి దొరకి దొరసానికి అన్నివిధాలైన పనులు చేసిపెడ్తుండే వాడిని. వాళ్ళ పిల్లల్ని ఎత్తుకోవడం, ఆటలకి తీసికెళ్ళడం, బడికి తీసి కెళ్ళడం, తలంటు పోయడం తర్వాత దొరసానికి వంటలోసహాయపడటం' అంట్లు తోమడం, పొయ్యి అంటించడం, అప్పుడప్పుడు వంట కూడా చెయ్యడం, ఇల్లు తుడవడం, దొరకి స్నానానికి నీళ్ళు తోడటం, పళ్ళు రాయటం, ధోవతులు, తువ్వాలలు మొదలైనవి వుతకటం, రాత్రుళ్ళు పక్కలు వేయటం, రామిరెడ్డిగారికి నిద్రపట్టకపోతే కాళ్లు పట్టడం ఇలాంటి పనులన్నీ ఇరవై నాలుగు గంటలూ చేసేవాడిని. నాకు నెలకింత అని జీతంలేదు. వాళ్లే తిండీ బట్ట ఇచ్చేవాళ్ళు. అంతకంటే నాకింకే అవ సరమూ అప్పట్లో కన్పించలేదు.

నాకా పేరు ఎప్పుడు పడిందో కాని నన్నంతా "అమాయకుడు" అంటుండేవాళ్లు. "ఉత్తఅమాయకుడు" "వెర్రిబాగులవాడు" నోట్లో నాలుక లేనివాడు. మొదలైన పేర్లన్నీ నాకు పడ్డాయి. వాళ్ళంతా అలా అంటు న్నారని తెలిసినప్పటి నుండీ నేనింకా అమాయకుడిలా, వెర్రిబాగులవాడిలా కన్పించడానికి ప్రయత్నించేవాడిని. అలా కన్పించడంవల్ల కొన్ని లాభాలు కూడా కన్పించాయి. మా దొరసాని అప్పుడప్పుడు బజారు కెళ్ళి ఏదైనా కొనుక్కురమ్మని డబ్బులిస్తే వాటిల్లో కొన్ని మిగిలించడం నేర్చుకున్నాను. క్రమక్రమంగా నాకా డబ్బుల అవసరం తెలిసివచ్చింది. అలా మిగిలించుకున్న డబ్బుల్తో ఆ వూరికి పదిహేనుమైళ్ళ దూరంలో వున్న పట్నానికి వెళ్ళి అదీ యిదీ కొనుక్కుతినడం — సినిమాలు చూడడం అలవాటయింది. నేను డబ్బులు కాజేస్తున్నానన్న అను మానం మా దొరసానికి ఎప్పుడూ వచ్చేది కాదు. పైగా పట్నం వెళ్తున్నానంటే ఆమె కూడ కొన్ని డబ్బులిచ్చేది. ఇలా రామిరెడ్డిదొర యింట్లో చాలా యేళ్లు గడిచాయి.

అలాంటి నా జీవితంలోకి ఈ రంగారెడ్డి - సరోజలు అకస్మా త్తుగా, పెద్ద తుఫానులా ప్రవేశించారు. రంగారెడ్డి ప్రక్కవూరి జమిం

చాడు. మా దొరకంటే బాగా ఆస్తి, పలుకుబడి, దర్జా వున్నవాడు. మా దొరకి దూరపు బంధువు కూడ. ఒకసారి ఎందుకో మా వూరు వచ్చాడు. రంగారెడ్డి—మా దొర ఆయన్ను మా యింటికి ఆహ్వానించాడు. మా దొరకి రంగారెడ్డంటే కొంత భయం, భక్తి వున్నట్లు గమనించాను. త్వరలోనే రంగారెడ్డికి నామీద కన్ను పడింది.

"వాడు మీ పనిచేసే కుర్రాడా ?" అని అడిగాడు.

"ఔనండి. ఉత్త వెర్రిబాగుల వెధవ. ఏ పని చెప్తే ఆ పని చేస్తాడు. ఇంత పెడితే పడుంటాడు. చాలా నమ్మకస్తుడు" అన్నాడు మా దొర.

"నాక్కూడా యిలాంటివాడు ఒకడు కావాలోయ్ — నాకు యింట్లో పనిచేయడానికి నమ్మకస్తుడెవడూ దొరకటం లేదు. ఈ రోజుల్లో ప్రతి వెధవకి పొగరు-పదేళ్ళ క్రితం నన్ను చూస్తే మా వూళ్ళో ప్రతివాడూ ఉచ్చపోసుకునేవాడు. ఏ పని చెప్పినా చచ్చినట్లు చేసేవాళ్ళు. ఇప్పుడు-ప్రతి అడ్డగాడిద తిరగబడేవాడే. నా దగ్గర ఎవ్వడూ రెండు మూడు నెలల మించి పనిచెయ్యటం లేదు. మీ వాడిని కొంతకాలం నాతో పంపించు చూస్తాను. వీడైనా కొంతకాలం పనిచేస్తాడేమో" అన్నాడు రంగారెడ్డి.

అంతే—రంగారెడ్డితో ఈ ఊరు వచ్చాను. రంగారెడ్డి నాకు నచ్చ లేదు. అతన్ని చూడగానే నాకు భయమేసింది. అతని చూపులో, నవ్వులో మాటలో ఎంతో విషం కరుకుదనం వున్నాయి. అతని రూపంకూడా అలాగే వుంటుంది. ఎర్రగా కమిలిన ముఖం బుర్రమీసాలు ఆరడుగుల విగ్రహం అంతకు తగ్గ లావు. ఎదుటి వాడిని చీల్చి వేసేట్టుగా చూసే చిన్ని చిన్ని కళ్ళు కరకుగా కఠినంగా, ఖంగుమని మ్రోగే కంచు కంఠం. ఇలాంటి రెడ్డిని చూస్తే పనిపిల్లాళ్లు జడుసుకుంటారు.

ఆ ఊళ్ళో చాలా భాగం రెడ్డిగారి బంగళా ఆక్రమించుకొని వుంది. ఎప్పుడో పూర్వపు పద్ధతిలో కట్టబడిన బంగళా అది. గదులు, వసారాలు, చీకటి గుయ్యారంలా వుంటాయి. బంగళాలో కొంత భాగం శిథిలమై పోయింది. కూలగొట్టారట. రెడ్డి మళ్లా బాగుచేయించలేదు. కాపురమంటూ వుండే అంత యింట్లోను వుండేది రెడ్డి ఒక్కడే—రెడ్డి

భార్య చనిపోయి చాలా కాలమయిందట. ఆయనకున్న యేకైక కూతురు సరోజ పట్నంలో కాలేజీలో చదువుతోందట.

రెడ్డి నాకు రకరకాల పనులు చెప్పేవాడు. వాకిలి వూడ్చి, చల్లడం నుండి మొదలిడితే అర్ధరాత్రి వరకు నాకు తీరిక వుండేది కాదు. పనుల్లో కొన్ని హీనమైనవి, కొన్ని గౌరవమైనవి. కొన్ని ఆడవాళ్లు మాత్రమే చేయాల్సినవి, కొన్ని మొగవాళ్లు చెయ్యకూడనివి వున్నాయని నాకు తెలియదు; చెప్పినపని చేసుకుపోవడమే తెలుసు. రెడ్డి నన్ను క్షణం వూరుకోనివ్వకుండా పనులు పురమాయించేవాడు. నేను ఎప్పుడైనా యేపనీ లేకుండా కూర్చుంటే ఆయనకు చిరాకువేసేది.

"మొద్దులా తిని కూర్చుంటున్నావా?" అని బూతులు తిట్టి అప్పటి కప్పుడు యేదైనా పని కల్పించి చెప్పేవాడు. నోరు మెదపకుండా చేసే వాడిని. ఎంత పనిచేసినా రెడ్డి తృప్తిపడేవాడుకాడు. ఎక్కడ యేకొంచం ఆలస్యం జరిగినా యిల్లు ఎగిరిపోయేలా అరిచేవాడు. ఒకటి రెండు సార్లు నిష్కారణంగా తన్నాడుకూడా. ఏమాత్రం అలుసు యిచ్చినా నెత్తిన ఎక్కి కూర్చుంటానని అతని నమ్మకం.

నేనెప్పుడూ యిల్లు విడిచి వెళ్ళేవాడిని కాను. ఎప్పుడైనా వెళ్ళితే ఆ వూరివాళ్ళంతా నన్నో బలిపశువును చూచినట్లు జాలిగా చూసేవాళ్లు. ఆ వూళ్ళో ఒక పాడుబడిన శివాలయం వుండేది. దాంట్లో రామయ్యతాత అని ఒక వృద్ధుడుండేవాడు. అతనికెందుకో నాపట్ల విపరీతమైన జాలి. ప్రేమ, అభిమానం ఏర్పడ్డాయి నాలాగే అతనికి ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరట. ప్రతిరోజూ ఊళ్ళోకి వెళ్ళి ఎవరైనా యేదైనా పెడితే తిని వచ్చి ఆ శివాలయంలో పడుకునేవాడు. నన్ను చూడగానే "ఏ వూరు నాయనా ? నీ కెక్కడా దిక్కూ మొక్కూ లేదా ? మా ఊరి దొరే దొర కాడా ! ఈయనదగ్గర ఏవడైనా సరే యింతవరకు పట్టుమని పదిరోజులు కూడ పని చెయ్యలేదు. హింసించి హింసించి ప్రాణాలు తోడేస్తేగాని రెడ్డికి తృప్తి వుండదు" అన్నాడు రామయ్యతాత. అప్పుడప్పుడు రామయ్యతాతని చూడటానికి వెళ్తుండేవాడిని.

రంగారెడ్డికి చాలా అలవాట్లున్నాయి. ఇరవై నాలుగు గంటలూ తాగమన్నా తాగుతాడు. తింటాడు. కల్లుబుడ్లు, సారాసీసాలు క్షణాల్లో

ఖాళీ అవుతుండేవి. రోజుకు ఒకటి రెండు కోడిపెట్టలు తెగిపోతుండేవి. రాత్రిళ్లు రెడ్డిగారు షికారుకెళ్తుండేవారు, (ముండల షికారు) నన్నుకూడ వెంట తీసుకెళ్లేవాడు — ఏ గుడిసెలోనన్నా దూరి నన్ను బయట కాపలా ఉండమనేవాడు. కొన్నిసార్లు తనకి కావలసినవాళ్ళని తన యింటికే రప్పించుకునేవాడు. రెడ్డి దృష్టి పడిందంటే ఆ ఊళ్ళోవున్న యే పేదింటి ఆడదైనా అతనింటికి రావలసిందే - రెడ్డికి కావలసిన ఆడ దాన్ని బలవంతంగానైనా సరే తెచ్చిపెట్టడానికి కావలసిన ఇద్దరు ముగ్గురు వస్తాదులు రెడ్డి చేతిక్రింద రెడీగా వుంటారు.

బాగా త్రాగిన నిషాలో రెడ్డి పరమబూతులు మాట్లాడేవాడు. తనకి తానే పగలబడి నవ్వుకొనేవాడు—తనకి 'పదహారేళ్ళ పోరన్నా' గుడ్లె కొచ్చిన పెట్టన్నా చాల ఇష్టమనేవాడు. రెడ్డి తెచ్చుకునే ఆడవాళ్లు ఇరవై ఏళ్ళ లోపుగా వుండేవాళ్లు. ఇరవై ఏళ్లు దాటిన స్త్రీని రెడ్డికన్నెత్తి చూడడని ఆ వూళ్లో చెప్పుకునేవాళ్లు. ఇంటికొచ్చిన ఆడవాళ్ళని అప్పు డప్పుడు నాముందరే చీరలాగడం-బుగ్గగిల్లడం-కౌగలించడం మొదలైనవి చేసేవాడు.

"ఆడు సూత్తుండ"ని వచ్చినామె అంటే.

"వాడుచూస్తే యేందే? కుర్రకుంక-అసలు నీకో సంగతిచెప్పనా.... అప్పుడప్పుడు నా పక్కలోకి ఎవ్వత్తె దొరక్కపోతే వాడే గతి"అంటూ గొల్లున నవ్వేవాడు. నా రక్తమాంసాలు ఉడికి పొయ్యేవి. అప్పటికి నా వయస్సెంతో నాకు తెలియదు. బహుశా 18, 19 దాటివుంటాయని నానమ్మ కం. కాని నేనెప్పుడూ పొట్టి నిక్కరూ, బనీను వేసికోవడం వల్ల "కుర్ర కుంక"లా కన్పించేవాడిని.

ఇంటికొచ్చిన ప్రతి ఆడదానితో "నీ వయస్సెంతే" అని అడుగు తుండేవాడు రెడ్డి. "పదహారో పదిహేడో" అని ఆ వచ్చినామె అంటే "సరిగ్గా మా సరోజ వయసన్న మాట" అని యెంతో ఆనందంగా, గర్వంగా అనేవాడు. అలా చాలామందితో "సరిగ్గా మా సరోజవయసన్న మాట" సరిగ్గా మా సరోజ వయసన్నమాట" అని పదే పదే రెడ్డి అన డం—అలా అన్నప్పుడల్లా అతనిలో ఏదో తృప్తి, ఏదో కోరిక, తీరిన ఆనందం అతనిలో కనిపిస్తుండేవి- రెడ్డి ఇలా అంటాడని ఆ ఊళ్లో

చాలామందికి తెలుసు. చాలామంది రెడ్డిలోని ఈ చేష్టగూర్చి చాల వింతగా చెప్పుకొనేవాళ్ళు.

నేను ఈ ఊరు వచ్చిన నెలరోజులకు సరోజ పట్నం నుండి వచ్చింది, వేసవి శెల వులకని. సరోజ ముమ్మూర్తులా రంగారెడ్డి లాగుం టుంది. సరోజని చూడగానే రెడ్డిని చూసినప్పటిలాగే నాకు భయమేసింది. రెడ్డిలాగే చాల ఎత్తరి, అందుకుతగ్గ పుష్టి ఎదుటి వ్యక్తిని కోరగా, తిని వేసేట్లు చూసేచూపులు- ఆమె చూపులో, మాటలో, నడకలో చాల గర్వం- ప్రతిదానిపట్ల నిర్లక్ష్యం కనిపిస్తుండేవి.

సరోజ నన్ను చూడటంతోనే వింతగా ఈలవేసి "ఓహో కొత్త నౌఖరువా? గుడ్- నాకు నచ్చాడు. ఎక్కడ సంపాదించావు నాన్నా ఈ వింత మృగాన్ని" అంది.

"మన రామిరెడ్డి యింట్లో పట్టుకొచ్చాలే ఉత్త ఎడ్డిగాడిద. నీకు అన్నిపనులు చేసి పెడతాడని తీసుకొచ్చాను" అన్నాడు రెడ్డి.

సరోజ యింట్లో అడుగు పెట్టిన క్షణంనుండి తండ్రికంటే ఎక్కు వగా పనులు పురమాయించడం మొదలెట్టింది. నన్ను చాల ఆశ్చర్యపర చిన విషయం రెడ్డికి సరోజ మీదున్న విపరీతమైన ప్రేమ. ఉక్కుపిండం లాంటి రెడ్డి సరోజ ముందు కరిగి నీరై పోయేవాడు. ఆమె ఎంతచెప్తే అంత. ఆమె పట్నంనుండి రాగానే రెడ్డి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆమెను కౌగలించుకున్నాడు. "చాలా చిక్కిపోయావమ్మా" అన్నాడు. "హాస్టల్లో తిండి సరిగా లేదా?" "వారంరోజుల కొక్కసారైనా చికెన్ వుండని వెధవతిండి" వెధవ పరీక్షల కోసం రాత్రింబవళ్ళు చదివి ఆరోగ్యం పాడుచేసుకొన్నావా!" ఇలాంటి ప్రశ్నలడుగుతూ ఆ రోజంతా సరోజను ఎంతో అపురూపంగా చూసుకొన్నాడు.

రెడ్డిగారింటికొచ్చే భూస్వాములు, షావుకార్లు ఎవరైనా మీ అమ్మాయి పెళ్లెప్పుడు చేస్తారు దొరా? అని అడిగితే రెడ్డి మండి పడేవాడు.

"పెళ్ళి! పెళ్ళి! పదహారేళ్లు నిండకుండానే పెళ్ళి—ఇరవై ఏళ్ళు లోపలే ఇద్దరు ముగ్గురు పిల్లల్ని కని ముసలమ్మై కూర్చుంటే మీ కందరికీ సంతోషం. మా సరోజకి యిప్పుడప్పుడే పెళ్లి చేయను. అది

బి.ఎ. ప్యాస్‌కావాలి. ఎం.ఎ ప్యాస్‌కావాలి. మా సరోజఅంటే ఏమనుకున్నారో అది రాణి. ఆడదైనా నా కీర్తి నిలబెడుతుంది. అందరిలా పెళ్ళిచేసుకొని పిల్లల్ని కంటుందనుకుంటున్నారేమో? అదెన్నటికీ జరుగదు సరోజ...నా సరోజ అందరిలా సామాన్య స్త్రీలా పెళ్ళిచేసుకొని పిల్లల్ని కనడమా—అలా ఎన్నటికీ జరుగదు" అని ఒక ఘాటైన ఉపన్యాసం యిచ్చేవాడు రెడ్డి. రెడ్డి కంఠంలో ప్రాణం వుండగా సరోజకి పెళ్ళికాదని ఆ వూళ్ళో చాలామంది నమ్మకం.

సరోజ నాకు చెప్పే పనుల్లో కొన్ని నాకు సరదాగా వుండేవి. ఆమె స్నానానికి నీళ్ళుపెట్టడం, స్నానం చేశాక టవల్, లంగా, చీరె, బాడీ, జాకెట్టు మొదలైనవి అందించటం. ఆమె తలకి నూనె రాయటం ఇలాంటి పనులు సరోజ కూడా నన్ను "కుర్ర కుంక" క్రిందే జమకట్టి నట్టుంది. అప్పుడప్పుడు నా ముందే చీర విప్పేయడం జాకెట్ మార్చు కోవడం చేస్తుండేది. రాత్రిళ్లు నిద్రపట్టటం లేదని పక్కమీద దొర్లుతూ నన్ను పిలిచి విసనకర్రతో విసరమనేది. ఆమె ప్రక్కనే ఏవేవో ఇంగ్లీషు పుస్తకాలు గుడ్డల్లేని మగవాళ్ళ, ఆడవాళ్ళ బొమ్మలున్న పుస్తకాలు పడివుండేవి. ఉక్కగా ఉందని నా ముందే జాకెట్ విప్పే స్తుండేది. ఇవన్నీ చూస్తున్నప్పుడు నా నరనరాల్లో రక్తం ఉప్పొంగి ప్రవహించేది. ఎప్పుడూ సరోజని అంటి పెట్టుకుని ఉండకపోతే నాకు తోచేదికాదు.

ఒకరోజు సరోజ జాకెట్ మార్చుకొంటోంది. ఆమె కోసం కాఫీ తీసివెళ్ళిన నేను చూస్తూ నిల్చున్నాను-అలా చూడటం నాకుగాని, ఆమెకు గాని క్రొత్తేమీకాదు. ఈసారి ఎందుకో అకస్మాత్తుగా సరోజ నాకేసి చూసింది. నా చూపులో ఆమెకు ఏం కన్పించిందోగాని మండిపోయింది.

దొంగరాస్కెల్—ఏమిట్రా చూస్తున్నావు. నిన్నిక్కడికి ఎవ్వరు రమ్మన్నారు?—ఫో—బయటకు.... నాలిముచ్చు వెధవ... కుర్రకుంక అనుకున్నాను... గెటవుట్.. గెటవుట్...అని వెర్రెత్తినట్టుగా అరి చింది. వెంటనే బయటకు వచ్చాను.

ఆ మర్నాడే మరోచిత్రం జరిగింది.

ఇంటివెనుక బావిఫద్ద స్నానం చేస్తున్నాను. నన్ను పిలుచుకుంటూ వచ్చింది, సరోజ. ఓ చిన్న తుండుగుడ్డ తప్ప నా శరీరం మీద ఏమీ లేదు. నాకేసి తదేకంగా చూడటం మొదలెట్టింది సరోజ. చిన్ననాటి నుంటి బండచాకిరి చేయడం బాగా తినడం నల్ల రాయిలా వుండేది నా శరీరం. నా శరీరంలో ఆమెకు ఏం కన్పించిందోగాని కాస్సేపు స్తంభించి పోయింది.

ఆ రోజు నుండి సరోజ నన్ను చాలాదూరంగా వుంచడం మొద లెట్టింది. నేను కనిపిస్తే విపరీతమైన చికాకును, కోపాన్ని చూపేది. నోటి కొచ్చినట్లల్లా తిట్టేది. దున్నపోతు- పశువు- అడ్డగాడిద మొద్దు ఎద్దు ఇలాంటి పేర్లతోనే పిల్చేది. నాకు కన్పించవద్దని కసిరేది. కాని నాకొక విషయం తెలిసిపోయింది. ఎంతతిట్టినా ఎంత కసిరినా సరోజను రాసుకు తరగడం మంచిదని - కావాలని ఒక తుండుగుడ్డ కట్టుకొని ఆమెకు ఎదురు పడేవాడిని, సరోజ రెచ్చిపోయేది, పళ్ళు పటపట కొరు కుతూ.

ఒరే దున్నపోతూ ఎందుకురా అలా బైరాగిలా తిరుగుతావు?.... ఈసారి నాకలా కన్పించా వంటే చీల్చిపారేస్తాను. అనేది. అయినా నేను అలాగే ఆమె కంటపడేవాడిని. కోపంతో శివమెత్తినట్లుండేది సరోజ.

ఒకసారి రంగా రెడ్డితో చెప్పింది...

ఈ దున్నపోతు మనకొద్దు నాన్న... వీడిని వెంటనే మళ్లీ రామి రెడ్డి యింటికి పంపించెయ్యండి. ఆయన నవ్వాడు.

"పిచ్చి సరూ? వాడు దున్నపోతైనా నమ్మకస్తుడే— వాడిలా చెప్పిన పనులన్ని చేసిపెట్టేవాడు. ఈరోజుల్లో మనకెవడూ దొరకడు.

"పో నాన్నా! నేను ఆ మొద్దుతో వేగలేకపోతున్నాను— వాడికి చెప్పింది ఏదీ అర్థంకాదు. నా ప్రాణాలు తినేస్తున్నాడు" అంది సరోజ విసుగ్గా.

"వాడికి కొంచెం కొత్తగదా— త్వరలోనే నేర్చుకుంటాడు లే. అంతేగాని వాడిని తీసిపారేశామంటే వాడిలాంటివాడిక దొరకడు" అన్నాడు రెడ్డి.

ఆ తర్వాత సరోజ ప్రవర్తన యింకా వింతగా మారింది. పూర్వంలా ఎప్పుడూ హుంషారుగా వుండే సరోజ ఏదో ఆలోచిస్తున్నట్లు పరధ్యానంగా వుండటం గమనించాను. ఒక రోజు రెడ్డి యింట్లో లేడు. ఊళ్లోకి షికారు వెళ్లాడు—రాత్రి 9 గంటలో పది గంటలో అయి నట్లుంది. సరోజ చాలాకాలానికి నన్ను తన గదికి రమ్మంది. వెళ్ళాను. నిద్ర పట్టక ప్రక్కమీద దొర్లుతుంది. ప్రక్కలో పుస్తకం పడివుంది. అదే పుస్తకం ఆమె ఎప్పుడూ చదివే ఆ నగ్నంగావున్న బొమ్మల పుస్తకం—ఎందుకో ఆ క్షణంలో సరోజను చూస్తే చాల భయమేసింది. విడిబోయిన జుట్టు బాగా చెమటలు కారిపో తున్న శరీరం, ఏదో విపరీతమైన బాధని వ్యక్తం చేస్తూ చెమటలతో జిడ్డుగా వికృతంగా వున్న ముఖం---బాగా నలిగిపోయిన చీర- సరోజను అలా చూడటం అదే మొదటిసారి...

నన్ను దగ్గరగా రమ్మంది. వెళ్ళాను. ఇంకా దగ్గరకు రమ్మంది. భయం భయంగా వెళ్ళాను. ఏ క్షణంలో యేం జరుగుతుందోనని నా గుండెలు విపరీతంగా కొట్టుకుంటున్నాయి———మరుక్షణంలో - మెఱుపులా... సరోజ నన్ను తన మీదికి లాక్కుంది. నా ఎముకలు విరిగి పోయేలా ఆమె హృదయానికి హత్తుకుంది. రక్తం కారేలా నా చెంపల్ని కొరికింది. ఊపిరి తీసికోటానికి కూడ అవకాశం ఇవ్వకుండా ఉక్కిరి బిక్కిరి చేసింది. యింకో క్షణం అలా వుంటే నా ప్రాణాలు పోతా యేమో ననిపించింది. కాని మరుక్షణంలోనే నన్ను తన మీద నుండి త్రోసేసింది. మంచం క్రింద పడిపోయాను.

"దొంగ రాస్కెల్———ఎందుకొచ్చావిక్కడికి, ఫో! ఫో! గెటవుట్, గెటవుట్!" అని అరిచింది. ఆమె కళ్ళు చింతనిప్పుల్లా మండిపోతున్నాయి. అంతా ఏదో కలలా జరిగిపోయింది.

ఇది జరిగిన సరోజ నాపట్ల అతి క్రూరంగా ప్రవర్తించసాగింది. కావాలని అతి కష్టమైన పనులు - నిజంగా అవసరం లేనివి చెప్పేది. పెరట్లో ఏ నాటినుండో వున్న చెత్తా చెదారమంతా ప్రోగుచేసి కాల్చి వేయమంది, అది చాలా పెద్ద పెరడు — ఒక్కరోజులో పెరడంతా శుభ్రం చేయకపోతే ఎముకలు విరగ్గొడతానంది.

అది సాధ్యం కాదు అమ్మగారంటే "తిరగబడతావా వెధవ" అని వాళ్ళ నాన్నతో.

"వీడు బొత్తిగా చెప్పిన పని చేయటం లేదు. తిరగబడడం నేర్చుకున్నాడని" చెప్పింది. వెంటనే రంగారెడ్డి రూళ్ళకర్రతో నన్ను బాదటం మొదలెట్టాడు. రూళ్ళకర్రతో కీళ్ళమీద కొడుతుంటే బాధని భరించలేక నేను "అమ్మో ! అని కేకలు వేస్తుంటే — సరోజ కిల కిలా నవ్వుతూ ఇంకా నాన్న - యింకా నా వంతుంది అంటూ కొట్టించింది. రంగారెడ్డి తనని తనివి తీరా, తన కూతురు తనివి తీరా కొట్టి వదిలేశాడు. ఆ దెబ్బలతో రెండు రోజులు పక్కమీదనుండి లేవలేకపోయాను. ఆ తెల్లారి నొప్పులతో బాధపడ్తున్న నా దగ్గరకు వచ్చి బాగా తగిలాయిరా ? సారీ— ఎక్కడ తగిలాయిరా" అంటూ నా శరీరాన్ని నిమురుతూ జాలిపడింది సరోజ "పాపిష్టిదాన్ని—— నిన్ను కొట్టించాను" అని కళ్ళనీళ్ల పెట్టుకుంది. కాని ఈ జాలి, ప్రేమ ఎంతో కాలం నిల్చేవికావు. మళ్ళీ వెంటనే ఆ క్రూరత్వం— దెబ్బలు మాని నేను లేచాక రెండు మూడు రోజులకే పెరట్లో దూరంగాఉన్న ఏనాటిదో బొంద - దాన్నిండా మట్టిపోసి పూడ్చేసే పని చెప్పింది. అది చేసేవరకు తిండిపెట్టేది లేదని రెండుమూడు రోజులు ఆకలితో మాడ్చి చంపింది. నేను చూడాలని, నన్ను పిలచి నా ముందు అతి రుచికరమైన భోజనంచేస్తూ "ఆకలి వేస్తోంది కదురా ! పాపం ! రోజూ దున్నపోతులా తింటున్నావాయె — పనిచెప్తే చేతకాదాయె. ఈ దేశంలో నీలాంటి వాళ్ళందరికీ రెండుపూటలా తిండి దొరుకుతోందా ? మా యింట్లో పుణ్యానికి వచ్చింది కదా అని నువ్వు మెక్కుతున్నావు" అంటూ తనకితానే పిచ్చిగా నవ్వుకునేది. కాని మళ్ళీ ఆ రాత్రి ఆకలితో ప్రాణాలుపోతున్న నా దగ్గరకు వచ్చింది.

"పాపం ! ఆకలేస్తోందిరా ! సారీ— లేలే— అన్నం తిందువుగాని లే !" అని లేపి అన్నంపెట్టింది.

అది జరిగిన నాలుగైదురోజులకి, ఒక అర్ధరాత్రి బంగళాబయట నిద్రపోతున్న నన్ను సరోజ లేపింది. ప్రక్కనే వరండాలో రెడ్డి గుర్రు పెడుతూ నిద్రపోతున్నాడు. అడుగులో అడుగు వేసికొంటూ సరోజ

పెరట్లోకి - పెరట్లో దూరంగావున్న ఒక పాడుబడ్డ గదికి తీసికెళ్ళింది. ఆ గదిని రెడ్డిగారు పూర్వులెవరో వ్యవసాయపు పనిముట్లు పెట్టుకోవటానికి కట్టించారట. ఆ వూళ్ళో కొంతకాలం క్రితం చాలమంది దొంగచాటుగా కలిసికునే ప్రియులు పెరటిగోడలు దుమికి ఆ గదిలో తమ కోర్కెల్ని తీర్చుకునే వాళ్ళట. ఇది తెలిసిన రెడ్డిగారు స్వయంగా రెండు మూడు రోజులు కాపలాకాసి ఒక జంటను పట్టుకుని ఆ తెల్లారి ఊరిపెద్దల సమక్షంలో వాళ్ళని శిక్షించాడట. అప్పటినుండి ఆ గదిలోకి రహస్య ప్రేమికులు రావడం తగ్గిపోయిందట. ఎందుకో ఎప్పుడో అప్పుడు సరోజ నన్నాగదికి తీసుకెళుతుందని నాకో నమ్మకం ఏర్పడింది. ఈ రాత్రి అదే జరుగుతున్నది. నిశ్శబ్దంగా యిద్దరమూ ఆ గదిలోకి నడిచాము.

ఆ గదిలో ఆ రాత్రి సరోజ తన నిజ స్వరూపం చూపించింది. ఎన్నాళ్ళనుంచో ఆకలితోవుంది సరోజ. నన్ను తినేసింది. ఆ క్షణంలో సరోజ ఒక మనిషిలా కన్పించలేదు. కోరికల అగ్నిలో భయంకరంగా మండుతున్న జ్వాల సరోజ అంతే. ఆ రోజునుండి ప్రతి అర్ధరాత్రి సరోజా, నేను ఆ గదికి వెళ్ళడం మామూలై పోయింది. ప్రతి రాత్రీ సరోజ నన్ను చంపేస్తుందేమో నన్నంత వెర్రిగా ప్రవర్తించేది. నా శరీరంతో ఆడుకొనేది. నా శరీరాన్ని హింసిస్తూ సంతోషించేది. నన్ను ఊపిరి తీసుకోనివ్వకుండా ఉక్కిరి బిక్కిరి చేస్తుండేది. ఒక్కమాటలో నన్ను ప్రతిరోజు తినేసేది. కాల్చి వేసేది. కొంతకాలం ఇలా సాగితే నేను బ్రతకలేనేమోనని భయం నాలో ఏర్పడింది. ఆ యింటి నుండి సరోజ నుండి పారిపోదామను కున్నాను కాని—— నాక్కూడా సరోజపట్ల ఒక వెర్రి వ్యామోహం యేర్పడింది. సరోజ నన్ను ఎంత ఎక్కువగా హింసించి కోర్కె తీర్చుకుంటే నా కంత తృప్తి కలిగేది.

* * *

దూరంగా కాస్సేపు మొరగటం ఆపేసిన కుక్కలు మళ్ళీ మొరగడం లంకించుకోవడంతో ఈ లోకంలోకి వచ్చాను. ప్రక్కనే వరండాలో రెడ్డి ఊరంతా విన్పించేంత గుర్రుపెడ్తున్నాడు. సరోజ ఈ రోజు ఇంకా

రాలేదు. లోపల నిద్రపోయిందేమో—— ఈరోజు రాదేమో— సరోజ రాకపోతే బ్రతుకగలనా ? నేనే వెళ్ళి లేపితే మళ్ళీ ఎందుకో గుబులు గుబులుగా భయం నన్ను ఆవరించింది— అకస్మాత్తుగా రెడ్డికి మెలుకువ వస్తే నన్ను సరోజ ఆ గదివేపు వెళ్ళడంచూస్తే నిలువునా పాతేస్తాడు. గొడ్డలితో నరికేస్తాకు— మళ్ళీ ఆ పిట్ట "ఆ దయ్యం పిట్ట" అరచుకుంటూ పోయింది. మళ్ళీ నా కాళ్ళు చేతులు వణకటం మొదలెట్టాయి. యిక సందేహం లేదు. తెల్లవారేలోగా నేను చచ్చిపోతాను. గుండెల్ని సులిమి వేస్తున్నభయం. ఇంతలో తలుపు కిర్రుమన్న చప్పుడు ఉలిక్కిపడ్డాడు. సరోజ వస్తోంది. సరోజ వస్తోంది. అడుగులో అడుగువేసి కొంటూ అతి నిశ్శబ్దంగా గుర్రుపెడ్తున్న తండ్రిని దాటి— రెడ్డిని నిద్ర ప్రపంచంలోని యే శక్తి చెదరగొట్టలేదు.

బాగా త్రాగిన నిషా అది. వేయి ఏనుగులతో త్రొక్కించినా రెడ్డి నిద్రలేవడు. సరోజ వస్తోంది— నురుగులు క్రక్కుతున్న తెల్లచీర, తెల్లజాకెట్ తెల్లగా కదలి వస్తోంది— తెల్ల చీర అంటే సరోజకి చాల యిష్టం. ఆ చీకట్లో సరోజ తెల్లగా వస్తుంటే మళ్ళీ నాకు భయంవేసింది. దెయ్యాలు కూడా అలాగే తెల్ల చీరలు కట్టుకుని వస్తాయట. ఎందుకో ఆ వచ్చేది సరోజ కాదనిపించింది. ఏదో దెయ్యం వస్తోంది. అడుగులో అడుగు వేసుకుంటూ సరోజ నన్ను సమీపించింది. నేను నిద్రపోయి నట్లు నటిస్తున్నాను.

"ఒరే లేవరా లేవరా త్వరగా" అంటోంది. బతిమాలుతున్నట్లుగా భయంగా, నిశ్శబ్దంగా, ఆవులిస్తూ లేచాను.

"అప్పుడే నిద్రపోయావురా?" అంది.

"ఇప్పుడే నిద్రపడ్తోందమ్మగారు. ఇవ్వాళ ఇంత ఆలస్యం చేశారేం" అన్నాను.

"ఇవ్వాళెందుకో విపరీతంగా భయమేస్తోందిరా. అసలు రాకూడదనే అనుకున్నాను. కాని ఎంత ప్రయత్నించినా రాకుండా వుండలేక పోయాను" అంది.

ఇద్దరమూ అగుడులో అడుగు వేసుకుంటూ ఆ గదివేపు. ఆ పాడుబడ్డ గది ఏ క్షణంలో కూలి పోతుందో అన్నట్టుగా కనిపించే, ఆ

గదిని పగలు చూస్తేనే భయం వేస్తుంది. ఇలా అర్ధరాత్రి ఆ గదిలోకి వెళ్ళే మొండి ధైర్యాన్ని మాలో ఏ శక్తి కల్గిస్తున్నదో!—

గదిలోకి వెళ్ళటంతోటె గడ్డిమీద ఒరిగింది, సరోజ. నన్ను తన మీదకి లాక్కొంది. గట్టిగా ముద్దులు పెట్టుకుంది.

"ఎన్నాళ్ళ రా యిలా— ఎన్నాళ్లరా— మా నాన్నకి తెలుస్తే నిన్ను నన్ను నరికేస్తాడు" అంది ఆవేశంగా— భయంగా—

"ఎందుకోగాని— ఇవ్వాళ నాక్కూడా బాగా భయం వేస్తోంది."

"ఎందుకురా— ఎందుకురా భయం" ఆమె గొంతు నిండా భయం.

"ఇవ్వాళ్ళ ఆ పిట్ట అరిచింది. ఆ పిట్ట అరపు వింటే నాకు చాలా భయమేస్తుంది."

"ఏ పిట్టరా—"

"అదే— దాన్ని "దయ్యంపిట్ట" అంటారు. అది అరచినప్పుడు దాని నోట్లోంచి నెత్తురు పడ్తుందట. అలా ఎన్ని నెత్తురు చుక్కలుపడ్తే అంతమంది చనిపోతారట."

భయంతో సరోజ వణికి పోతోంది— నన్ను యింకా యింకా గట్టిగా కౌగలించుకుంది—

"ఇక చెప్పకురా— ఇక చెప్పకురా" అంది, కాస్సేపు నిశ్శబ్దం మా ఇద్దరి గుండెల చప్పుడు తప్ప.

అకస్మాత్తుగా సరోజ నన్ను కుదిపివేస్తూ.

"వెంటనే పెళ్ళిపోదామురా—వెంటనే ఎక్కడికైనా—వెళ్ళిపోదాం ఈ ఇంట్లో యిలా ఎంతోకాలం బ్రతకలేమురా—" అంది.

"ఎక్కడికమ్మగారు—" ఏమీ తెలియడం లేదు నాకు హాయిగా వున్న సరోజ శరీరం తప్ప.

"ఎక్కడికైనా సరే...ఈ ఇల్లు నాకెందుకో దయ్యాల కొంపలా కనిపిస్తోంది. మా నాన్నని ..మా నాన్నని చూస్తే నా కెందుకో భయ మేస్తుందిరా" అంది సరోజ...సరోజ గొంతు హెచ్చిస్తోంది.

"మీ నాన్నకి మీరంటే ప్రాణం కదమ్మగారు—"

"ఛీ! ఛీ! అంత విపరీతమైన ప్రేమ మంచిది కాదు. అదే ఆయన చూపించే ఆ ప్రేమంటేనే నాకు భయం. ఆ ప్రేమ నాకెందుకో

అసహ్యం కల్గిస్తుంది. నాకు ఇరవై యేళ్ళున్నాయి. యింకా పసిపిల్లనే అనుకుంటాడు నా వయస్సుకు తగ్గట్టుగా నాకు కోరిక లుంటాయని ఆ మనిషికి తెలియనే తెలియదు. నేను బి. ఏ లు యమ్. ఏ లు ప్యాసు కావాలని ఆయన వెర్రికోరిక. నాకు చదవాలని ఏమాత్రం లేదు—ఈ జన్మలో నేను బి. ఏ, ప్యాసుగాలేను. నేను బి. ఏ. ప్యాసుకాందే పెళ్ళి చేయడు నాన్న—ఎంతకాలమని కాల్చివేసే కోరికల్ని అణచుకోగలను? లాభం లేదురా ఈ మనిషితో నేనిక బ్రతకలేను—వెంటనే ఎక్కడి కైనా వెళ్ళిపోదాము...వెంటనే...ఈ రాత్రే.,.ఏమంటావురా?"

ఆవేశంగా తననుతాను మరచిపోయి మాట్లాడుతోంది సరోజ—క్షణంసేపు నిశ్శబ్దం—అలాగే లేచిపోదాం. అందామనుకున్నాను... ఆకస్మాత్తుగా బయట అడుగులచప్పుడు—మా గుండెల్లో పిడుగులు పడ్డాయి. సరోజ నన్ను కరుచుకుపోయింది...మరుక్షణంలో ఖంగుమని మ్రోగిన రెడ్డి కంఠం—మా ఇద్దరి ప్రాణాలు పోయాయి. సరోజ ప్రాణాలు బిగబెట్టి నాకు అంటుకుపోయింది.

"ఎవర్రాలోపల?—ఎవరు? మళ్లీ మొదలైందే గోల...ఈ ఊళ్లోని రంకుముండల కందరికీ నా పెరడు ఆశ్రయమౌతోంది—ఎన్ని గుండెలు...బయటికి రండి—చంపేస్తాను..." రెడ్డి కర్కశంగా అంటు న్నాడు.

వెంటనే నా బుర్రలోకి మెరపులాంటి ఆలోచన వచ్చింది. సరోజను ఈ ప్రమాదంనుండి రక్షించవచ్చు – "మళ్లీ మొదలైంది ఈ గోల" అంటంలో రెడ్డి ఉద్దేశం గ్రహించాను. ఎవరో ఊళ్లోని రహస్య ప్రేమికులు పూర్వంలాగ ఈ గదిలోకి వచ్చారని రెడ్డి అనుకుంటున్నాడు. ...నేనే ఊళ్ళోనుండి ఒకదాన్ని తెచ్చుకున్నానని, ఈసారికి క్షమించమని కాళ్ళు పట్టుకుంటే రెడ్డి వెళ్ళిపోతాడానుకున్నాను. బలవంతంగా సరోజను వదలించుకుని బయటకొచ్చాను. చీకట్లో నన్ను వెంటనే గుర్తుపట్టలేదు రెడ్డి.

"ఎవడ్రా...ఎవడ్రా నువ్వు అన్నాడు రెడ్డి.

"నేనండి పిచ్చిగాడ్ని" అన్నాను.

ఖంగుమని నవ్వాడు రెడ్డి.

"వోరి నువ్వు... నువ్వ(్రటా...నీకూ్కడా ముండ కావల్సి వచ్చిం దిరా...బాగా దాహం వేసి మెలుకువ వచ్చింది—మంచనీళ్లు తేరా పిచ్చిగా" అని అరిస్తే జవాబులేదు...మొద్దు వెధవ నిద్రపోయాడేమో ననుకున్నాను. ఇంతలో పెరట్లోనుండి మాటలు వినిపిస్తున్నాయి...ఊఁ అయితే నువ్వేనన్నమాట...ఎవ్వత్తిరా లోపల...నీకొచ్చేంత దిక్కు మాలిన ముండెవ్వత్తిరా ఈ ఊళ్ళో...చూడ్డానికి కుర్రకుంకలాగున్నావు అసాధ్యుడివే."

"ఏదో బుద్ధి గడ్డితింది ..ఈ ఒక్కసారికి క్షమించండి. మళ్ళా ఎప్పుడూ చెయ్యను మీ కాళ్ల పట్టుకుంటాను. ఈ సారికి వదిలే యండి."

ఆయన కాళ్ల గట్టిగా పట్టుకున్నాను.

"వదిలేస్తాను లేరా...కాని ఒకసారి నీ ప్రేయసిని నేను కూడా చూడాలి"—విషపు నవ్వు నవ్వాడు రెడ్డి.

వద్దు...వద్దండి...వద్దండి...మీరు చూడవద్దు. మీరు చూస్తే ఆమె బతకదు. మీరు వెళ్ళి పడుకోండి... ఈ ఒక్కసారికి వదిలేయండి నన్ను కొట్టి చంపండి...కాని ఆమెను మీరు చూడవద్దు ఏడ్చాను. నాతల అతని పాదాలుకేసి బాదుకున్నాను.

ఓరి—ఓరి—యెందుకురా యేడుస్తావు—నేను చూస్తే అది బత కదా—అంత రోషం ఉందయితే ఇంతదూరం ఎందుకు వస్తుందిరా పిచ్చి గాడిద...యింటికొచ్చిన పిట్టని వదిలే అలవాటు నాకు లేదురా...ఒకసే ఛాన్సు...సరోజ వచ్చినప్పటినుండి...నీకు తెలుసుగా—మన షికారు కొంచెం తగ్గింది...ఒక ఛాన్సు చూచి వదిలేస్తాలే...

రెడ్డి మాటలకు అర్థమేమిటో తెలిసేటప్పటికి నా తల తిరిగి పోయింది...అతని కాళ్ల యింకా గట్టిగా నా శక్తినంత ఉపయోగించి పట్టుకున్నాను.

వద్దు—వద్దండి—వద్దండి—అంటున్నాను.

పిచ్చి వెధవ—ఎందుకురా అంతగోలచేస్తావు—అది ఎప్పుడూ నీతో వుంటుందనుకుంటున్నావా —ఇవ్వాళ నువ్వు..రేపు మరొకడు— రేపేమిటి ఇప్పుడే నీ ముందే...అది నన్ను యిష్టపడుతుంది చూడు.

ఏమంటావే పోరే అంటూ రెడ్డి కదిలాడు...నేను అతని కాళ్ళను వదల లేదు.

వదలరా గాడిదా—వదులు— చస్తావు లేకపోతే – వెళ్ళి పడుకో పో— నేను దాన్ని పంపిస్తానుగాని పో – వదిలేయి నా కాళ్ల వదిలేయి అంటున్నాడు రెడ్డి. నేను అలాగే పట్టుకున్నాను.

"చెప్తే వినవు వెధవ అంటూ గట్టిగా తన్నాడు. నా పట్టు తప్పి పోయింది. మూతిమీద బాగా దెబ్బతాకింది. రక్తం కారుతున్నట్లుంది– నేనిక చచ్చిపోతాననిపించింది – రెడ్డి ఆ గదిలోకి వెళ్ళాడు – ఏం జరుగుతుందో నని ఊపిరి బిగబెట్టి చూస్తున్నాను.

"ఎవ్వతివే పోరి – క్రొత్తపిట్టవా–పాత పిట్టవా ? ఈ ఊళ్ళో నీకు మా పిచ్చిగాడే దొరికాడా? నేను లేను? రా–ఫస్టుక్లాస్ టెర్లిన్స్ చీర కొనిస్తాను–రా" అంటున్నాడు రెడ్డి.

"నాన్నా !–"అని వికృతంగా అరిచింది. సరోజ పాపం బ్రద్ధ లయింది.

"సరోజీ—సరోజీ ! నువ్వా నువ్వా ! పిచ్చిగాడితోనా ! పిచ్చి గాడితోనా !" గొంతు చించుకుంటున్నాడు రెడ్డి.

రెడ్డి అలా వెర్రిగా అరవటం "పిచ్చిగాడితోనా.. పిచ్చిగాడితోనా" అనటం—నా కెందుకో ఒక పిచ్చి ఆనందాన్ని కలుగజేసింది. మరు క్షణంలో సరోజను జడ పట్టుకొని బయటకు లాక్కొచ్చాడు రెడ్డి. శివ మెత్తినట్లు "గంగ వెర్రు లెత్తినట్లు రెడ్డి ఊగిపోతున్నాడు. సరోజను కొడ్తున్నాడు – తంతున్నాడు — ఉమ్మేస్తున్నాడు— అలాగే ఈడ్చుకు పోతున్నాడు – జంతువును ఈడ్చుకు పోయినట్లు– ఆ కంపలోంచి ఆ చెత్తా చెదారంలోంచి. సరోజ ఏడ్వడం లేదు. ఒక శవంలాగ పడివుంది.

వెంటనే నాకు లేచి పారిపోవాలన్న స్పృహవచ్చింది. మళ్ళీ రెడ్డి కంటపడితే నరికేస్తాడు – శక్తినంతా కూడ దీసుకుని లేచాను. పెరటి గోడ దుమికి ఆ రాత్రికి రాత్రే ఆ ఊరు విడిచి పారిపోయి వచ్చాను. ఆ రాత్రి సరోజ ఏమైందో నాకు తెలియదు.